నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, మంగళవారం 11 మార్చి 2025 | MAHABUBABAD


## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- ప్రభుత్వ వైఫల్యంతోనే ఎండుతున్న పంటలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో నష్టం
- రైతులను పట్టించుకోని మంత్రులు, నాయకులు
- ఎకరానికి రూ.20వేలు సాయం చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జనగామ, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : దేవాదుల నీళ్లు సకాలంలో విడుదల కాకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే రైతులను పట్టించుకునే నాయకుడు లేడని, జిల్లా మంత్రులకు సమీక్షించే తీరిక లేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. సోమవారం జనగామ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసన మండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నీళ్ల కోసం రైతులు అరిగోస పడుతుంటే కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ అసమర్థ పాలనతో వచ్చిన కరువు అని స్పష్టం చేశారు. దేవాదుల ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు రూ.7వేల కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించక 33 రోజులు మోటర్లు ఆన్ చేయని ఫలితంగా ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి తాను చేసిన తప్పును ప్రకృతి మీదకు నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, నీళ్లు ఇవ్వొద్దని మోటర్లకు అడ్డంగా హరీశ్‌రావు లేదా బీఆర్ఎస్ నాయకులు నిలుచున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ సమ్మక్కసాగర్ బరాజ్ కట్టారని, మూడు నుంచి నాలుగు టీఎంసీల నీళ్లు ఇప్పటికీ అందులో ఉన్నాయన్నారు. దేవాదుల ఫేజ్-3 కూడా పూర్తయిందని, ఆ మోటర్లు నడిపితే ఇంకా ఎక్కువ నీళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వంతో పోరాటం చేసి, ఇరిగేషన్ మంత్రి, సెక్రటరీ వెంటపడి 30 రోజులకు రూ.7 కోట్ల నిధులు విడుదల చేయించుకొని మోటర్లు రిపేర్ చేయించారని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మోటర్లు బాగుంటే భీంఘన్‌పూర్, చలివాగు, ధర్మసాగర్, గండిరామారం, బొమ్మకూరు నింపుకొని తపాస్‌పల్లి దాకా నీళ్లు తెచ్చుకునే వాళ్లమన్నారు. ఇప్పటికైనా దేవాదుల ఫేజ్-3 మోటర్లను వెంటనే ప్రారంభించి పంటలకు నీరందించి, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేల సాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### 40 రోజులు దేవాదుల మోటర్లు ఆన్ చేయలేదు..

**- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే**

గోదావరిలో సరిపడా నీళ్లుండి.. పైపులైన్లు, పంపులు, మోటర్లు, కాల్వలున్నా దేవాదుల ద్వారా రైతును ఆదుకోవాలన్న చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. గడిచిన 50 రోజుల్లో 40 రోజులు మోటర్లు ఆన్ చేయకుండా ప్రభుత్వం రైతుల పంటలను ఎండగొడుతున్నదని, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని మండిపడ్డారు. పంటలు ఎండుతుంటే ఆక్రోశంతో రైతులు ఆందోళనకు దిగారని, కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో రైతులు తనవద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారన్నారు. రైతుల కన్నీళ్లు, కష్టాలు తీర్చేందుకు తనవంతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అధికారులను నిలదీసినా చలనం లేదన్నారు. గ్రామాలకు వెళితే ఒక్కో రైతు గోడున విలపిస్తుంటే చూడలేక పోయానని, గత బీఆర్ఎస్ పాలనలో కాల్వలో పారిన నీళ్లను ప్రజలు, రైతులు గుర్తు చేసుకుంటున్నారని పల్లా తెలిపారు. సమావేశంలో నాయకులు సేవెల్లి సంపత్, బక్క నాగరాజు, పెద్ది రాజిరెడ్డి, బండ యాదగిరిరెడ్డి, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, తాళ్ల సురేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల అవసరాలనుగుణంగానే బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వినూత్న ఆలోచనలు, ఆందోళనలకు రూపకర్త అని, తెలంగాణ ప్రజల సామాజిక, చారిత్రక అవసరాలకు అనుగుణంగా బీఆర్ఎస్‌ను స్థాపించారన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలన దేశానికే దిక్సూచిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యంత ఎక్కువ వరి ధాన్యం పండించే రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. తెలంగాణలో అమలు చేసిన అనేక కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉచిత కరెంటు, సాగునీరు, రైతుబంధుతో వడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిందని, హామీలు ఇవ్వని రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ఎన్నో పథకాలను అమలు చేసిందని వివరించారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి బనకచర్ల నుంచి గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతుంటే బీజేపీ, కాంగ్రెస్‌లు మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిందన్నారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెదవులు మూసుకుంటే 42 రోజులు అసెంబ్లీని స్తంభింపజేశామన్నారు. రాష్ట్రంలో ఆరుగురితో మంత్రి పదవులకు రాజీనామా చేయించి కొట్లాడిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీఅమలు చేయని చరిత్ర కాంగ్రెస్‌ది అయితే, ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌ది అన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ మాట వినాలని, ఆయనను చూడాలని కోరుకుంటున్నారన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య తదితరులు

# ఓరుగల్లుతో బీఆర్ఎస్‌ది విడదీయలేని బంధం

- ఏడాది పాటు సిల్వర్ జూబ్లీ వేడుకలు
- దేశానికే దిక్సూచిలా కేసీఆర్ పదేండ్ల పాలన
- ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత గులాబీ పార్టీదే
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- రజతోత్సవ సభ కోసం స్థలాల పరిశీలన

### ఉద్యమంలోనూ ఇక్కడ భారీ బహిరంగ సభలు జరిపిన చరిత్ర

హనుమకొండ, మార్చి 10: తెలంగాణ ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన బీఆర్ఎస్ పార్టీకి, ఓరుగల్లుకు విడదీయరాని అనుబంధం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహణ కోసం వరంగల్ నగర శివారులోని ఉనికిచర్ల, భట్టుపల్లిలోని స్థలాలను పరిశీలించారు. అనంతరం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో రజతోత్సవ సభ నిర్వ హించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఈ వేడుకలు ఏడాది పాటు జరపనున్నారని, వరంగల్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. ఉద్యమాల ఖిల్లా వరంగల్‌లో అనేక బహిరంగ సభలు నిర్వహించామని, గతంలో 15 లక్షల మందితో మహాగర్జన నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు. 14 ఏళ్ల పోరాటం, 10 ఏళ్ల పాలన రెండింటి మేళవింపే రజతోత్సవాలని ఆయన పేర్కొన్నారు. సభకు వరంగల్ నగర సమీపంలోని రెండుమూడు చోట్ల స్థలాలను పరిశీలించామని, కచ్చితంగా ఎక్కడ అనేది ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. ఈ రోజు తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకమైన మిలియన్ మార్చ్ జరిగిన రోజు అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు హుజూరాబాద్, దుబ్బాక, మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయిందని, అమ్ముడుపోవడం ఆయనకు అలవాటని విమర్శించారు. సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య పాల్గొన్నారు.



భట్టుపల్లిలో సభా స్థలిని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

# కాల్వ పారదు.. పొలాలకు నీరు చేరదు


**అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతను అరిగోసపెడుతున్నది. వేసవి ప్రారంభంలోనే వాగులు, చెరువులు, కుంటలు ఎండిపోగా, ప్రభుత్వం కాల్వల ద్వారా నీరు విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండడంతో భూగర్భ నీటి మట్టం వేగంగా పడిపోతున్నది. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని ప్రధాన జలాశయాలన్నీ అడుగంటుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సమస్య మరింత కష్టాల పాలు చేస్తున్నది. ఫలితంగా యాసంగి పంటలు రైతుల కళ్లముందే ఎండిపోతున్నాయి. తడారిన నేలకు నీరు పెట్టేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. అయినప్పటికీ సమృద్ధిగా నీరందక ఇప్పటికే సగం మేర పంటలు దెబ్బ తిన్నాయి. మిగిలినదైనా చేతికొస్తుందా? పెట్టిన పెట్టుబడి తిరిగొస్తుందా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు.**

*- హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి 10*



### మళ్లీ మొదలైన కరెంట్ కష్టాలు

భీమదేవరపల్లి : అన్నదాతకు మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే వాగులు, చెరువులు, కుంటలు ఎండిపోగా, కాల్వల ద్వారా జలాలు రావడం లేదు. దీంతో వ్యవసాయ బావులు, బోర్లలో సైతం నీరు అడుగంటి పోతున్నది. దీంతో యాసంగి పంట వేసిన రైతులు బోర్లు, బావుల్లో ఉన్న కాస్త నీళ్లు పంటలకు అందించి వాటిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తుంటే వస్తూ, పోతున్న కరెంట్‌తో మోటర్లు కాలిపోతుండడంతో వాటి మరమ్మతుకు అనేక కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చెందిన కొదురుపాక వెంకటస్వామి అనే రైతుకు చెందిన మోటర్ కాలిపోయింది. అతడి వద్ద పనిచేస్తున్న మారుపాక గోపాల్ ఎడ్లబండిపై మోటర్‌ను రిపేర్ షాపుకు తీసుకెళ్లి మరమ్మతు చేయించిన అనంతరం బావిలో బిగించేందుకు వెళ్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయంటూ గ్రామస్తులు చర్చించుకోవడం కనిపించింది.



ఎల్కతుర్తి మండల కేంద్రంలో చుక్కనీరు లేని తురకల కుంట

హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో వరి, మరో లక్షన్నర ఎకరాల్లో మక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. మరో లక్ష ఎకరాల్లో ఇతర పంటలతో పాటు ఉద్యాన పంటలు వేశారు. ఈ రెండు జిల్లాలకు ఎస్సారెస్పీతో పాటు దేవాదుల కాల్వలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. ఈ సారి వర్షాలు సమృద్ధిగానే కురిసినప్పటికీ ప్రభుత్వం ముందు చూపు లేని కారణంగా రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నది. ప్రస్తుతం రెండు జిల్లాల్లో వరి పంట పొట్ట దశలో ఉండగా, మక్కజొన్న కంకి పెడుతున్న ఈ సమయంలో ఎక్కువ నీరు అవసరం ఉంటుంది. అయితే నీటి లభ్యత లేక వరితో పాటు ఇతర పంటలు ఎండిపోతున్నాయి. అయితే ఎస్సారెస్పీ, దేవాదుల ప్రధాన కాల్వల్లో నీరున్నప్పటికీ పొలాలకు వెళ్లే పిల్ల కాల్వలు అధికారుల పర్యవేక్షణ లేక పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోయాయి. దీనికి తోడు కాల్వలు ఆక్రమణలకు గురికావడంతో నీరు చివరి ఆయకట్టుకు వెళ్లడం లేదు. దేవాదుల ఉత్తర కాల్వకు కొన్ని రోజులుగా నీరు విడుదల చేస్తున్నప్పటికీ ప్రధాన దక్షిణ కాల్వకు మాత్రం కేవలం నాలుగైదు కిలో మీటర్ల వరకు మాత్రమే జలాలు తరలుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉత్తర కాల్వ ఆయకట్టు 15 వేల ఎకరాలుండగా, కేవలం 25 శాతం పొలాలకు కూడా నీరందడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇక ఎస్సారెస్పీ అనుబంధ కాకతీయ కాల్వ చివరి ఆయకట్టు రైతులకు నీరందక పోవడంతో పంటలు మొత్తం ఎండి పోయే పరిస్థితి నెలకొంది. కాగా, హనుమకొండ జిల్లాలో 876 చెరువులు ఉండగా, వరంగల్ జిల్లాలో 1063 ఉన్నట్లుగా నీటిపారుదల శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ చెరువులు, కుంటలు ఇప్పటికే ఎండిపోగా, మధ్యస్థ చెరువుల్లో మాత్రం నీరు పూర్తిగా తగ్గిపోయింది.

### హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పాతాళానికి జలాలు

- అడుగంటుతున్న జలాశయాలు
- సాగు నీరందక ఎండుతున్న పంటలు
- పొట్ట దశలో వరి.. కంకి పెడుతున్న మక్క..
- యాసంగి పంట ఇంటికొచ్చుడు అనుమానమే..

### పాతాళానికి పడిపోయిన నీళ్లు..

ఈ ఏడాది క్రమం తప్పకుండా కురిసిన వర్షాలతో చెరువులన్నీ నిండాయి. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ వేసవి ప్రారంభంలోనే బావులు, బోర్లు వట్టిపోతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా పాతాళానికి పడిపోతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి గత ఏడాదితో పోలిస్తే ఈ సమయానికి రెండు మీటర్ల మేర నీటి మట్టం పడిపోయింది.



ఎల్కతుర్తిలో ఎండిన వరి పొలంలోఎడ్లను మేపుతున్న రైతు

### బాబు కాలంల పంటలు ఎండినయ్



ఐనవోలు : నేను నాలుగు ఎకరాల్లో జొన్న, రెండెకరాల్లో వరి సాగు చేస్తున్న.. ఈ భూమికి ఒక బాయి, ఒక బోరు ఉన్నయి. వీటిలో నీళ్లు లేక ఆరెకరాల్లో వేసిన పంట ఎండిపోయింది. జొన్నకు ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేలు, వరికి రూ.25 వేల చొప్పున పెట్టుబడి అయ్యింది. పది రోజుల కింద మరొక బోరు కూడా వేయించినా నీళ్లు పడలేదు. గతంలో డిసెంబర్ నుంచి మార్చి వరకు కాల్వల ద్వారా మస్తు నీళ్లు వచ్చేటియి. ఈ సారి మాత్రం ఒక్కసారే వచ్చినయ్. అప్పుడెప్పుడో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంటలు ఎండినయ్. మళ్లీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి సీఎం అయినంక ఎండుతున్నయి. ప్రభుత్వం ఇప్పటికైనా కాల్వలో నీళ్లు వదిలితే మిగిలిన రైతుల పంటలన్నా దక్కుతయి.

*– కొట్టం రాజు, రైతు, ఒంటిమామిడిపల్లి (నాగపురం), ఐనవోలు మండలం*



### నీళ్లు లేక పొలం మొత్తం ఎండింది

ఎల్కతుర్తి : మాకు 2 ఎకరాల పొలం ఉంది. వానకాలంలో పంట చేతికొచ్చింది. నీళ్లు పుష్కలంగా ఉంటయని యాసంగిలో సైతం 2 ఎకరాల్లో వరి నాట్లేసినం. గిప్పుడు నీళ్లు లేవు. పొలం మొత్తం ఎండిపోయింది. రోజుకు గుంట మడి కూడా తడుస్తలేదు. అప్పు తెచ్చి ఎకరాకు రూ. 35 వేల చొప్పున రూ. 70 వేల వరకు పెట్టుబడి పెట్టినం. ఇన్ని పైసలు నీళ్లల్లో పోసినట్లయ్యింది. ఎండిపోయిన పంటలో ఎడ్లను మేపుతున్నం. సర్కారే మమ్మల్ని ఆదుకొని పరిహారం చెల్లించాలి. లేకపోతే మా బతుకులు ఆగమవుతయ్.

*– అల్లి ప్రమీల, మహిళా రైతు, ఎల్కతుర్తి*

### ఎనకటి రోజులు వస్తున్నయ్..



పరకాల : నాది పరకాల మండలం వెల్లంపల్లి. నాకు గ్రామ శివారులో మూడు వ్యవసాయ బావుల కింద 12 ఎకరాల్లో యాసంగి వరి పంట సాగు చేస్తున్న. గత పదేండ్లలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగు నీరు రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట పండేది. ఈ సారి ఇప్పటికే వ్యవసాయ బావులు అడుగంటడంతో నాలుగు ఎకరాల పొలాన్ని వదిలిపెట్టి ఎనిమిది ఎకరాలకే నీరు పెడుతున్న. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ బావుల్లో సరిపడా నీరుండడం లేదు. మరోపక్క కాల్వల ద్వారా నీరు రావడం లేదు. రానున్న రోజుల్లో నీరు లేక మొత్తం పంట ఎండిపోయే పరిస్థితి ఉంది. కేసీఆర్ పాలనలో ఎన్నడూ సాగు నీటికి ఇబ్బంది రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. మళ్లా ఎనకటి రోజులు ముందుకు వస్తున్నయి.

*– గంట సమ్మిరెడ్డి, రైతు, వెల్లంపల్లి, పరకాల*

### 30 గుంటల పొలం ఎండుతాంది..

కమలాపూర్ : నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. 1.20 ఎకరాల్లో మక్కజొన్న, 30 గుంటలు వరి పంట వేసిన. వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటి రోజుకు పదిగుంటలు మాత్రమే పారుతాంది. మక్కజొన్నకే వరుస తడులు తిరుగుతుంది. పొలానికి నీళ్లు అందకపోవడంతో పక్కనున్న వ్యవసాయ బావిని లీజుకు అడిగితే ఇవ్వలేదు. దీంతో పొలం ఎండుతాంది. పదేళ్లలో ఏనాడూ పొలం ఎండుడు చూడలేదు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదికే కరువు మొదలైంది. కుంటలో కాల్వ నీళ్లు నిండి పంటలు పండేది. అసొంటిది చూద్దామన్నా కాల్వ నీళ్లు రావడంలేదు. పొలం వదిలేసి మక్కజొన్నకు నీళ్లు కడుతున్న. పొలంకు పెట్టిన పెట్టుబడి డబ్బులు మీదపడ్డయి.

*– చెరిపెల్లి జీవానందం, రైతు, శనిగరం, కమలాపూర్ మండలం*



## నేడు కొండపర్తికి గవర్నర్

**ములుగు జిల్లాలోని దత్తత గ్రామంలో పర్యటించనున్న జిష్ణుదేవ్**



ములుగు, మార్చి10(నమస్తే తెలంగాణ)/తాడ్వాయి : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని సందర్శించనున్నారు. కొద్ది నెలల క్రితం ములుగు జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఈ గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకోగా స్థానిక మహిళలకు కుట్టు శిక్షణతో పాటు మసాలాల ప్యాకింగ్ యూనిట్లను అధికారులు ఏర్పాటు చేశారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా వీటిని ప్రారంభించనున్నారు. అనంతరం మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి కొండపర్తి, మేడారంలో ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ దివాకర సోమవారం పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్‌తో కలిసి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, అన్ని శాఖల అధికారులు, ములుగు, తాడ్వాయి మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి

## తిండి, నీళ్లు లేక అల్లాడుతున్నాం

- గ్రామాన్ని వెంటనే తరలించండి
- ఓసీ-3 ఎదుట పరశురాంపల్లి గ్రామస్తుల ధర్నా

గణపురం, మార్చి 10: తమ గ్రామాన్ని వెంటనే తరలించాలని, నీళ్లు, పనులు లేక ఆకలితో అల్లాడుతున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని పరశురాంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పునరావాస ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేటీకే ఓసీ-3 ప్రధాన రహదారిపై టెంటు వేసుకొని సుమారు 5 గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురాంపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ పొలాలు మొత్తం తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడంతో పనులు లేక పస్తులుంటున్నామన్నారు. ఓసీ-3 లో 90 శాతం వ్యవసాయ భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిందన్నారు. గ్రామంలో సింగరేణి ఏర్పడితే ఉద్యోగాలు వచ్చి తమ బతుకులు మారతాయని ఆశపడ్డామని, కానీ ఉపాధి కల్పించడంలో సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. బ్లాస్టింగ్‌లతో ఇండ్లు నెర్రెలు బారుతున్నాయని, దుమ్ము ధూళితో వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అడిషనల్ జీఎం కవీంద్ర అక్కడికి చేరుకొని ఊరు తరలింపుపై గ్రామస్తులు లిఖితపూర్వకంగా రాసిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఎర్ర బంగారం పోటెత్తింది. సుమారు 80వేల మిర్చి బస్తాలు రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. తేజ మిర్చి క్వింటాకు రూ.13,600, 341రకం మిర్చికి రూ.13 వేలు, వండర్ హాట్ రూ.17వేల ధర పలికింది. *– వరంగల్ ఫొటోగ్రాఫర్*